క్లుప్తంగా

31లోగా బీమా చేయించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఏవో శిరీష

బాడంగి: వరి, మొక్కజొన్న, పెసర, మినప వంటి పంటలకు గాను ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాలని ఏవో కె.శిరీష తెలిపారు. మండలంలోని రేజేరు గ్రామ రైతు సేవా కేంద్రంలో రైతులతో మంగళవారం సమావేశమైన ఆమె.. ఎకరా మినప పంటకు రూ.300, మొక్కజొన్నకు రూ.540, వరికి రూ.630 చొప్పున చెల్లించాలన్నారు. బీమా చేయించుకుంటే ప్రకృతి విపత్తుల కారణంగా పంట నష్టం జరిగితే పరిహారం వస్తుందన్నారు.

ఆకట్టుకుంటున్న తిరుప్పావై ప్రవచనాలు



ప్రవచనాలు చెబుతున్న ప్రవచనకర్త పద్మావతి

బొబ్బిలి: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్థానిక పట్టణంలోని శ్రీరుక్మిణీ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో విజయవాడకు చెందిన ప్రవచన కర్త తూపురాణి పద్మావతి చేసిన ప్రవచనాలు ఆకట్టుకుంటున్నాయి. ప్రవచనాలు వినేందుకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. ఇదిలా ఉండగా, మహారాణి పేటలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బేడా సేవ నిర్వహించారు.

వన్‌స్టాప్ సెంటర్ మహిళలకు ఓ వరం

బొబ్బిలి: వన్‌స్టాప్ సెంటర్ మహిళలకు ఓ వరం లాంటిదని వన్‌స్టాప్ సెంటర్ కేస్ వర్కర్ తాన్న అనిత అన్నారు. స్థానిక నారాయణ స్కూల్‌లో వన్‌స్టాప్ సెంటర్ సేవలపై బాలికలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఆపదలో ఉన్నప్పుడు ఏయే అవసరాలకు ఏయే నంబర్లను ఆశ్రయించాలో తెలిపారు. 1098, 181, 112, 1930 తదితర టోల్‌ఫ్రీ నంబర్ల సేవలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు చర్యలు



సంకిలిలో ఫాగింగ్ చేస్తున్న దృశ్యం

రేగిడి: గ్రామాల్లో దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శ్యామలా కుమారి సూచించారు. మండలంలోని సంకిలి, బొడ్డవలస, చిన్నయ్యపేట తదితర గ్రామాల్లో దోమల నియంత్రణకు ఫాగింగ్ చర్యలు మంగళవారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి యంత్రం సాయంతో దోమల నివారణ మందు స్ప్రే చేశారు. పలుచోట్ల క్లోరినేషన్ చేపట్టారు.

'ఉపాధి' పనులపై ఎంపీడీవో ఆరా

రాజాం సిటీ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న పనులపై ఎంపీడీవో వి.శ్రీనివాసరావు ఆరాతీశారు. ఇదే విషయమై ఏపీవో, ఈసీ, టీఏలతో మంగళవారం సమీక్షించి, గ్రామాల్లో నిర్మిస్తున్న పశువుల షెడ్లు, వేతనదారుల సంఖ్య, పని ప్రదేశాల్లో ఏర్పాటు చేయనున్న నేమ్ బోర్డులు, పూర్తయిన పనులు, పల్లె పండగ పనులపై సమీక్షించి, పలు సూచనలు చేశారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

వంగర: పంటల సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో తట్టికోట కన్నబాబు అన్నారు. మండలంలోని వీవీఆర్ పేట, రాజులగుమ్మడ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించి, రైతులతో కాసేపు మాట్లాడారు. పంటల సాగులో అధునాతన పద్ధతులు అవలంబించాలని, రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించాలని తెలిపారు.

అన్నదాత ఆందోళన



రామభద్రపురం: పొలాల్లోనే వర్షాలకు తడిసి పోతున్న వరి కుప్పలు

రామభద్రపురం/బాడంగి/సంతకవిటి: తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 1, 20వ తేదీలతో పాటు ఇప్పుడు కూడా తుపాను ప్రభావంతో వర్షాలు కురుస్తుండడంతో భారీగా పంటనష్టం వాటిల్లుతోంది. చాలాచోట్ల పంటలు నీటమునగడంతో అవి ఎక్కడ పాడైపోతాయోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల కోసిన వరి పంట కూడా పొలాల్లోనే ఉండి, తడిసిపోతోంది.

రేషన్‌కార్డుల జారీ ఎప్పుడో?



రేషన్‌కార్డుల మంజూరుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు తీసుకోవడం లేదని చెబుతున్న సచివాలయ సిబ్బంది

- కలగా కొత్త రేషన్‌కార్డుల మంజూరు
- ఈ నెల 2 నుంచి దరఖాస్తుల స్వీకరణ అంటూ ప్రచారం
- ఇప్పటివరకు తెరుచుకోని ఆన్‌లైన్ వెబ్‌సైట్
- కార్డుల కోసం అర్హులకు తప్పని ఎదురుచూపులు

రామభద్రపురం: పేదలకు రేషన్‌కార్డులు ఉంటే కొండంత భరోసా.. ప్రతినెలా కడుపు నింపుతోందనే ధీమా..ఉంటుంది. అలాగే పిల్లల చదువులు భారం కాకుండా అండగా నిలుస్తోందనే ధైర్యమిస్తుంది. పలు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు కూడా లభిస్తాయనే ఆశ పుడుతుంది. ముఖ్యంగా లక్షలాది రూపాయల వ్యయమయ్యే వైద్యానికి సాయపడుతుంది. అలాంటి రేషన్‌కార్డు పేదలకు కలగా మిగులుతోంది. ఈ నెల 2వ తేదీ నుంచి కొత్త రేషన్‌కార్డులు పొందేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రభుత్వం ప్రచారం చేసింది. అది ప్రచారికే పరిమితమైంది తప్ప కార్డుల మంజూరుపై స్పష్టత లేదు. దీంతో అర్హుల్లో అయోమయం నెలకొంది. కొత్త కార్డుల కోసం ఎదురుచూస్తున్న వారితో పాటు తల్లిదండ్రుల నుంచి విడిపోయిన వారు, ఒంటరిగా ఉన్న వారంతా సచివాలయాలకు వస్తుంటే వారికి సరైన సమాధానం ఇవ్వలేని దుస్థితిలో సిబ్బంది ఉంది. ఇలాంటి తరుణంలో రేషన్‌కార్డుల మంజూరు సంక్రాంతి పండగకు సాధ్యమేనా.. అంటే అది సాధ్యం కాదనే భావనలు ఉత్పన్నమవుతున్నాయి.

కార్డు ఉంటే రూ.25 లక్షల వైద్యం..

ప్రస్తుతం జిల్లాలో 5,81,668 రేషన్ కార్డులున్నాయి. ఈ కార్డుదారులకు ప్రతినెలా 90 వేల మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం సరఫరా అవుతోంది. అలాగే 3.50 మెట్రిక్ టన్నుల చక్కెర, 581 మెట్రిక్ టన్నుల కందిపప్పు వరకు పంపిణీ చేయడం జరుగుతోంది. ఇదిలా ఉంటే తెల్ల రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ కార్డు ఆధారంగా ఆరోగ్యశ్రీ సేవలు పొందేందుకు అర్హులు. ఫలితంగా ఏటా వైద్యసేవల పరంగా రూ.25 లక్షల వరకు వైద్యసేవలు పొందేందుకు అవకాశం ఉంది. దీనికితోడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పిల్లలకు స్కాలర్‌షిప్‌లు, ఉచిత విద్య, పేద ప్రజలు రాయితీపై రుణాలు పొందుతున్నారు. అయితే ఇలా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు రేషన్ కార్డు కీలకం కావడంతో లక్షలాది మంది కొత్తకార్డుల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం అర్హులైన వారు కార్డుల కోసం సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వస్తోందని అర్హులు వాపోతున్నారు.



గత ప్రభుత్వంలో ఇచ్చిన రేషన్ రైస్‌కార్డులు

గత సీఎంల ఫొటోలు తొలగించడమే లక్ష్యం..

ఇప్పుడున్న రేషన్‌కార్డులపై ఉన్న గత ముఖ్యమంత్రులు వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలను తొలగించడమే లక్ష్యంగా పెట్టుకుని, చంద్రబాబు సర్కారు ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డుల స్థానంలో కొత్త డిజైన్లతో కార్డులను ముంద్రించనున్నారనే సమాచారం వస్తోంది. ప్రస్తుతం ప్రజల దగ్గర ఉన్న కార్డులను పూర్తిగా మార్చడంతో పాటుగా గత ముఖ్యమంత్రుల ఫొటోలు కూడా తొలగించేందుకు రంగం సిద్ధమవ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇప్పుడు స్పష్టత లేదు..

ప్రస్తుతం కూటమి ప్రభుత్వ హయాంలో కొత్త రేషన్‌కార్డులు ఎప్పుడు ఇస్తారన్న దానిపై స్పష్టత లేదు. దీంతో రేషన్‌కార్డుల కోసం ఎదురుచూస్తున్న వారు అధికమవుతున్నారు. కొత్తగా పెళ్లిళ్లు అయిన వారు, కుటుంబ తగాదాల మూలాన విడిపోయిన వారు, సభ్యుల చేర్పు, తొలగింపు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కుటుంబాలు, ఆదాయ పన్ను సమస్యలున్న వారు రేషన్‌కార్డుల కోసం ఎదురుచూపులు చూడక మానడం లేదు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా ఏ ఒక్క హామీ అమలుపై స్పష్టత లేదని, రేషన్ కార్డుల జారీ కూడా కనీసం లేదని అందరూ విమర్శిస్తున్నారు.

ఉత్తర్వులు రాలేదు..



రేషనకార్డుకు సంబంధించి, అర్హులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఈ నెల 2వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించాలనుకున్నాం. కానీ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాలేదు. కొత్త రేషన్‌కార్డులు మాత్రమే కాదు.. ప్రభుత్వం ఎంబ్లమ్ ఉన్న రేషన్‌కార్డుల పంపిణీకి కసరత్తు జరుగుతోంది. త్వరలోనే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇస్తారు. ఈ విషయంలో ఎటువంటి అనుమానాలు, ఆందోళనలు వద్దు.

– కె.మధుసూదనరావు, డీఎస్‌వో, విజయనగరం

అప్పట్లో తలుపుతట్టి ఇచ్చే వారు..

వైఎస్సార్ సీపీ హయాంలో అర్హులకు ఇంటి తలుపు తట్టి మరీ రేషన్‌కార్డు మంజూరు చేశారు. కరోనా విపత్తు సమయంలో స్పందన వేదికగా చేసుకుని, ఇంట్లో నుంచి అర్జీ పెట్టుకున్నా సరే రేషన్‌కార్డు మంజూరు చేసేవారు. కరోనా తగ్గుముఖం పట్టిన తర్వాత రేషన్‌కార్డుల మంజూరును వేగవంతం చేశారు. సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న కొన్ని నిమిషాల వ్యవధిలో రేషన్‌కార్డులు అందజేశారు. అది కూడా వలంటీర్ల ద్వారా ఇంటికి తెచ్చి మరీ ఇప్పించేవారు. ఆ తర్వాత ఆరు నెలలకోసారి కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేస్తూ వచ్చారు. రేషన్‌కార్డులు కావాలనుకునే వారికి ఓ స్పష్టత ఉండేది.

'పోరుబాట'ను విజయవంతం చేయండి



రామభద్రపురం: వైఎస్సార్ సీపీ పోరుబాట కార్యక్రమ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

- మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

తెర్లాం: రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ ఈ నెల 27వ తేదీన చేపట్టనున్న వైఎస్సార్ సీపీ పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కోరారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఆ కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆయన మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచార సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు.. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ చార్జీలను ఎడాపెడా పెంచి ప్రజల నెత్తిన పెనుభారం మోపారని విమర్శించారు. పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నిరసనలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు టి.సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుది అసమర్థ పాలన..

రామభద్రపురం: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత నెరవర్చలేని అసమర్థ పాలన చంద్రబాబు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ ఈ నెల 27వ తేదీన వైఎస్సార్ సీపీ చేపట్టబోయే పోరుబాట కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పిన కూటమి సర్కారు.. అధికారంలోకి వచ్చిన తర్వాత అవే చార్జీలను పెంచేసి ప్రజలపై పెనుభారం మోపడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సీహెచ్ లక్ష్మణరావు, మండల జేసీఎస్ కన్వీనర్ సీహెచ్ సింహాచలంనాయుడు పాల్గొన్నారు.



రాజాం: పోరుబాట వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న డాక్టర్ తలే రాజేష్ తదితరులు

బాడంగి: వైఎస్సార్ సీపీ అధిష్టానం పిలుపు మేరకు ఈ నెల 27వ తేదీన రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ పోరుబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు తెలిపారు. ఇదే విషయమై స్థానిక ఎంపీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. ఓ వైపు విద్యుత్ చార్జీలు పెంచడమే కాకుండా ఎస్సీ, ఎస్టీలకు ఉన్న ఉచిత కరెంట్ పథకం కూడా ఎత్తివేయడం దారుణమన్నారు. కార్యక్రమానికి అందరూ తరలిరావాలన్నారు.

రాజాం: అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన కూటమి ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలను మోసం చేసిందని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ఈ నెల 27వ తేదీన పార్టీ చేపట్టే పోరుబాట కార్యక్రమ వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. రాజాంలోని అంబేడ్కర్ జంక్షన్ వద్ద ర్యాలీ నిర్వహిస్తామని, ఏడీఈ కార్యాలయం వద్ద నిరసన తెలిపి, పోరుబాట మెమొరాండం ఇస్తామని తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, రూరల్ అధ్యక్షుడు ఎల్.రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బి.నర్సింహులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న నాయీబ్రాహ్మణులు

రాజాం: మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట నాయీబ్రాహ్మణులు మంగళవారం నిరసన చేపట్టారు. ఇటీవల మున్సిపల్ అధికారులు పట్టణంలోని క్షౌ రవృత్తిదారులందరికీ బోర్డు పన్ను, సేవా పన్ను, వృత్తి పన్ను పేరుతో నోటీసులు పంపించారని నాయీబ్రాహ్మణుల రాష్ట్ర సంక్షేమ సంఘం, క్షౌ ర వృత్తి రాష్ట్ర సంఘం మాజీ అధ్యక్షుడు పి.తిరుపతి రావు ఆరోపించారు. వైఎస్సార్ సీపీ హయాంలో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను క్షౌ రవృత్తుల వారికి అందించిందని గుర్తుచేశారు. అధికారంలోకి వస్తే ఆదుకుంటామని, ఎమ్మెల్సీ ఇస్తామని మాయమాటలు చెప్పిన కూటమి ప్రభుత్వం.. ఇలా పన్నులు భారం మోపడం బాధాకరమన్నారు. పన్నులు కట్టాలని ఒత్తిడి చేస్తే పెద్దఎత్తున నిరసన చేస్తామన్నారు.

పెరియార్‌కు ఘనంగా నివాళులు



పెరియార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

రాజాం సిటీ: సామాజిక అసమానతలు తొలగించేందుకు కృషి చేసిన పెరియార్ రామస్వామి గొప్ప నాస్తికుడని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు దేబారిక రామప్పడు కొనియాడారు. స్థానిక బీఎస్పీ కార్యాలయంలో పెరియార్ 51వ వర్ధంతి మంగళవారం నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మూఢ నమ్మకాలను వ్యతిరేకించి, ద్రవిడ నాట నాస్తిక, ఆత్మగౌరవ, స్త్రీహక్కుల కోసం పోరాటం నడిపారన్నారు. అణగారిన ప్రజల అణచివేతలను ధైర్యంగా ప్రశ్నించి, సామాజిక మార్పు తీసుకువచ్చిన ధీశాలి.. పెరియార్ అని ప్రశంసించారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొత్స బుద్ధుడు తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ

రేగిడి: మండలంలోని కోడిశ, కొండవలస తదితర గ్రామాల్లో క్షయ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు చలమయ్య, రీనాచౌదరిలు ర్యాలీలో పాల్గొని, క్షయ వ్యాధి లక్షణాలు గుర్తించేందుకు అవసరమైన విషయాలను తెలియజేశారు.

ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు



డాక్టర్ తలే రాజేష్

రాజాం: నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ తన తరఫున, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తరఫున.. క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకుని, మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. ప్రశాంత వాతావరణంలో పండగ జరుపుకోవాలని, క్రీస్తు బోధనలను అనుసరించి ఆదర్శవంతమైన జీవనం సాగించాలని ఆకాంక్షించారు.

పశుగణన వేగవంతం చేయండి

వంగర: పశుగణనను వేగవంతం చేయాలని బొబ్బిలి పశుసంవర్ధక శాఖ డీడీ కె.గోపాలరావు సూచించారు. స్థానిక పశువైద్య కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన.. పశువైద్య కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలపై ఆరాతీశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడారు. గొర్రెలు, మేకలు పెంపకానికి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలతో పాటు ఉపాధి హామీ పథకం ద్వారా పశుగ్రాసం పెంపకం, మొబైల్ అంబులెన్స్‌ల సేవలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పశువైద్య సేవలపై అలసత్వం వద్దన్నారు. కార్యక్రమంలో ఏడీ బొత్స జయప్రకాష్ పాల్గొన్నారు.



రాజాం సిటీ: రాజాంలోని సన్ స్కూల్ వద్ద క్రిస్మస్ వేడుకల సందడి



తెర్లాం: విద్యుత్ వెలుగుల్లో అందంగా తెర్లాం ఆర్‌సీఎం చర్చి



వంగర: క్రిస్మస్ పండగకు సిద్ధమైన కె.కొత్తవలస ఆర్‌సీఎం చర్చి

ముస్తాబైన చర్చిలు

క్రిస్మస్ వేడుకలకు చర్చిలు అందంగా ముస్తాబయ్యాయి. విద్యుత్ కాంతుల్లో మెరిసిపోతున్న ప్రార్థనా మందిరాలు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఏటా డిసెంబరు 25న బాలయేసు పుట్టిన రోజు పురస్కరించుకుని, క్రిస్మస్ పండగ జరుపుకుంటుండడం గమనార్హం కాగా ఇళ్లను అందంగా అలంకరించుకోవడం, ఇంటిపై స్టార్ ఆకారంలో లైట్ ఏర్పాటు చేసుకోవడం, క్రీస్తు జన్మ వృత్తాంతం తెలియజేస్తూ క్రిబ్(పశువుల పాక) నిర్మించుకోవడం వంటివి పండగలో భాగం. 24వ తేదీ అర్ధరాత్రి నుంచే ఉత్సవాలు ఆరంభం కాగా పలుచోట్ల క్రిస్మస్ కేక్ కట్ చేసి, లోక రక్షకుడైన ఏసుప్రభువు సందేశాన్ని మతబోధకులు చదివి వినిపించారు. పరుల పట్ల జాలి, దయ, కరుణ, శాంతి, ప్రేమతో మెలగాలని ఆకాంక్షించారు.

– బొబ్బిలి, రాజాం



రామభద్రపురంలోని శ్రీరామ్‌నగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో క్రిస్మస్ వేడుకల్లో ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు



రామభద్రపురం: ఎంపీడీవో కార్యాలయంలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న అధికారులు



బాడంగి: మండల కేంద్రంలో అందంగా ముస్తాబైన ఆర్‌సీఎం చర్చి



రాజాంలో క్రిస్మస్ పండగకు సిద్ధమైన ఆర్‌సీఎం చర్చి

గోతులు పూడ్చేదెన్నడో?



రాజాం–రామభద్రపురం ఆర్‌అండ్‌బీ రోడ్డులోని తెర్లాం, మెరకముడిదాం మండలాల్లోని ఎం.ఆర్.అగ్రహారం–ఉత్తరావెల్లి గ్రామాల మధ్య రోడ్డు పూర్తిగా గోతులమయమైంది. దీంతో ఆ వైపుగా ప్రయాణించే వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రోగులు, గర్భిణులను ఆస్పత్రికి తరలించాలంటే నరకయాతన పడుతున్నారు. సంక్రాంతి పండగ నాటికి గుంతలు లేని రోడ్లు ఉంటాయని భరోసానిచ్చిన కూటమి ప్రభుత్వం.. ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్కడికక్కడ రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, గోతులు పూడ్చేదెన్నడోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, రోడ్లు బాగు చేయాలని కోరుతున్నారు.

– తెర్లాం

సకాలంలో గోశాలల నిర్మాణం పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో రాంబాబు

తెర్లాం: మండలానికి మంజూరైన గోశాలల నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఎంపీడీవో ఆర్.రాంబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ఏపీవో సుశీల అధ్యక్షతన సాంకేతిక, క్షేత్ర సహాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలానికి 54 గోశాలలు మంజూరయ్యాయని, వీటిలో ఇంతవరకు 41 గోశాలల పనులు ప్రారంభించి, వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయన్నారు. మిగిలిన 13 గోశాలల పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. కనుమ పండగ రోజున గోవులను గోశాలలో ప్రవేశాలు చేయించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, ఆలోగా మండలంలో చేపట్టిన గోశాలల నిర్మాణాన్నీ పూర్తి చేయాలని సూచించారు.

జనవరి 10లోగా పల్లెపండగ పనులు

తెర్లాం: మండలానికి మంజూరైన పల్లెపండగ పనులను జనవరి 10వ తేదీలోగా ప్రారంభించాలని ఎంపీడీవో రేగి రాంబాబు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో పనుల పురోగతిపై సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పల్లె పండగ పనులకు సంబంధించి, టెండర్ ప్రక్రియ పూర్తయినప్పటికీ పనులు ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. ఏ పంచాయతీలో పనులు ప్రారంభించలేదో ఆయా పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు మెమోలు జారీ చేయడం జరుగుతుందన్నారు. పనులు ప్రారంభమైన చోట త్వరితగతిన పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఏఈ వాసిరెడ్డి సత్యంనాయుడు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్: పల్లె పండగ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో పి.రవికుమార్ సూచించారు. ఇదే విషయమై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో మంగళవారం సమావేశమైన ఆయన.. నిర్దేశిత పనుల్లో ప్రగతి కానరావడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల లక్ష్యాలు త్వరగా చేరుకోవాలని తెలిపారు. సమావేశంలో పీఆర్ డీఈ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.